
# కాగల కార్యం గంధర్వులే తీరుస్తారు




"ఈ చంద్రిగాడి అఘాయిత్యాలు రోజురోజుకీ మితిమీరి పోతున్నాయి."

శాస్త్రి ఏదో చెప్పడానికి గొంతు సవరించుకున్నాడు. అంతలో కోటిరెడ్డే అందుకున్నాడు. "గ్రంథాలయ నిర్మాణంలో పదివేలదాకా తిన్నానని ఊరంతా తండోరా వేశాడా? ఇప్పుడేమో వేణుగోపాలస్వామి ఉత్సవాలబాపతు జమాఖర్చులు చూపించమంటున్నాడు." చుట్టకొస మెలిపెట్టి తుంచి, బొడ్డులోనించి అగ్గిపెట్టె అందుకున్నాడు.

"అడుగుతాడు అడుగుతాడు! ఎందుకడగడూ? రౌతు మెత్తనయితే గుర్రం మూడు కాళ్లతోనడిచిందట. మనం ఇలాగే చేతులు కట్టుకుని కూచుంటే నెత్తికి కూడాఎక్కుతాడు. రేపు పంచాయితీబోర్డు ఎలెక్షన్‌లో నీకు పోటీగా నిలబడి, ఆ ప్రెసిడెంటు గిరి కాస్తా ఊడబెరుక్కోకపోతే నా పేరు రామశాస్త్రి కాదనుకో!" శాస్త్రి పౌరుషంగా జందెం సవరించుకున్నాడు.

కోటిరెడ్డి ఆశ్చర్యపోలేదు. గుప్పు గుప్పున నాలుగు పీల్పులు పీల్చి కండ్రించి తుబుక్కున ఊసి, ఈజీచేర్‌లోకి జారగిలబడుతూ, "ఆలోచిస్తున్నాను. ఏంచేద్దామా అని..." శూన్యంలోకి చూస్తూ కోరమీసం సర్దుకున్నాడు.

"ఆలోచించు ఆలోచించు! నువ్విలా ఆలోచిస్తూ కూచుంటే వాడిపని వాడు చేసుకుపోతూంటాడు. ఇప్పటికే ఊళ్లోని కుర్రకారునంతా ఆకట్టుకున్నాడా? నాలుగు రోజులు పోతే మనకీ ఊళ్లో మంచినీళ్లుకూడా పుట్టనివ్వకుండా చేస్తాడు." అన్నాడు శాస్త్రి కసిగా.

కోటిరెడ్డి శాస్త్రికేసి తిరిగాడు. "నన్నేం చెయ్యమంటావు?" అన్నట్టు అతని ముఖంలోకి చూశాడు. అంత గంభీరమైన ముఖంలోకూడా దైన్యం దోబూచులాడింది.

"చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుంది మన వ్యవహారం. నే నెప్పుడే చెప్పానా? ఏదో ఒకటి చెయ్యాలని నువ్వింటేనా? మనం అప్పుడేగనక జాగ్రత్త పడిఉంటే వ్యవహారం ఇంతదాకా వచ్చేది కాదు. చేచేతులా చేసుకున్నది. అనుభవించక తప్పుతుందా మరి?"

కోటిరెడ్డి చుట్టపొగ మరో నాలుగు దమ్ములు పీల్చి, నడివీధిలోకి విసిరి, పక్కనున్న చెంబెడునీళ్లు గుటగుటా తాగి, పైపంచెతో ముఖం తుడుచుకుంటూ, "అదికాదు శాస్త్రీ! అయిందేదో అయిపోయింది. జరిగిపోయిందాన్ని తవ్వుకుంటూ కూర్చుంటే ఎలా? ముందు జరగవలసిందేదో ఆలోచించు!" అన్నాడు.

"అలా అన్నావు? బావుంది! నువ్వు ఊఁ అనారే కాని రేపీపాటికి ఆ పీడ కాస్తా వదిలించేయనూ? చూస్తావుగా ఈ రామశాస్త్రి ప్రతాపం!"

కోటిరెడ్డి శాస్త్రికేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"భీముడికి కబురు పెడతాను. అన్ని ఏర్పాట్లూ చేయిస్తాను" శాస్త్రి పైకండువా సర్దుకుని అరుగు మీదనించి దిగబోయాడు.

"ఇంతకీ ఏం చెయ్యదలుచుకున్నావేమిటి?"

"ఏముంది?" శాస్త్రి ముందుకి వంగి రహస్యంగా చెప్పాడు. "ఆ అడ్డు కాస్తా తొలగించేయడమే."

కోటిరెడ్డి ఉలిక్కిపడ్డాడు. అతని కళ్ళల్లో భయాందోళనలు దోబూచులాడాయి. "అంతపనే?" అన్నట్టు శాస్త్రికేసి చూశాడు.

శాస్త్రి శబ్దం రాకుండా నవ్వాడో విషపునవ్వు. "ఇంత పిరికివాడివి ఇంత కాలం ప్రెసిడెంటు గిరీ ఎలా వెలగబెట్టావో అర్థం కావడం లేదు." అన్నాడు హేళనగా.

"పిరికితనం కాదు శాస్త్రి. రహస్యం బైటపడితే. ."

మళ్ళీ నవ్వాడు శాస్త్రి. "ఎందుకు బైట పడుతుంది రహస్యం? ఆ చేసేదేదో కట్టుదిట్టంగా చెయ్యాలిగానీ. . ."

"అదే. . . అదే. . . అదే నేనూ అనడం!"

శాస్త్రి బిర్ర బిగుసుకుపోయాడు. జంధ్యాన్ని సవరించుకుంటూ "ఇరవై ఏళ్ళుగా సావాసం చేస్తున్నావు. ఇదేనన్నమాట నువ్వు సన్నర్థం చేసుకున్నది?" అంటూ రెడ్డి ముఖంలోకి చూశాడు.

"అది కాదు శాస్త్రీ. . ." ఏం చెప్పాలో తోచక నసిగాడు రెడ్డి.

"ఈ శాస్త్రి గనక ఉచ్చులు బిగిస్తే హరిహర బ్రహ్మాదులు సైతం కిక్కురుమనకుండా ఉచ్చుల్లో పడవలసిందే. రహస్యం బైటపడడం కాదు. అసలు మనల్ని అనుమానించేవాడే ఉండడు." శాస్త్రి బొడ్లోంచి రెండుగా మడిచిన పోస్టుకార్డు తీసి రెడ్డి చేతిలో పెట్టాడు.

"ఏమిటది?" రెడ్డి దానికేసి చూస్తూనే ప్రశ్నించాడు.

"కార్డుముక్క! ఆ చంద్రిగాడు ప్రస్తుతం ఊళ్ళో లేడుగా! రేపురాత్రి బండికి దిగుతున్నానని తన తండ్రిగారికి రాసుకున్న ఉత్తరంముక్క! ఆయనగారేమో రేపు రాత్రిబండికి దిగుతున్నారట! ఈయనగారేమో ఆయనగార్ని కలుసుకునేందుకు తమ పాలేర్ని స్టేషన్ దగ్గిరికి పంపించాలట! ఈ ఉత్తరంముక్క ఈయన గారికి ఎలాగూ *అందబోదు గనక*, తమ పాలేర్ని స్టేషన్ దగ్గిరికి పంపించడమంటూ జరగదు. అసలే అధ్వాన్నపు స్టేషను. అందులో రాత్రిబండి. మనిషన్నవాడెవడూ ఆ బండిలో దిగడు. ఒకవేళ ఒకటో అరో దిగినా మన ఊరికేసి వచ్చే నరమానవుడు ఉండడు. అందుచేత వాడు వచ్చినట్టు ఈ నాలుగు మైళ్ళూ ఆ తాటితోపులోంచి బిక్కుబిక్కుమంటూ రావలసిందే. భీముడికి ఎలాగూ కబురెడుతున్నాం గనక ఆ కాగలకార్యం కాస్తా గంధర్వులే తీరుస్తారు."

కోటిరెడ్డిముఖం చాటంతయింది. శాస్త్రిగారి ఎత్తుగడంతా అర్థమైపోయింది.

"సెభాష్! శాస్త్రీ! బుర్రంటే నీదేనోయ్!"

> *ఎవ్వాడు తమ స్వార్థంకోసం పరులకు అపకారం చెయ్యాలనే ధ్యానం కలవారికి, తమ బుద్ధి బెడిసి కొడుతుందనే శంక కలగదు. పాపం పెరిగి, పెరిగి పండుతుంది. ఫలితం అనూహ్యమైన దారుణం... పాపఫలాన్ని ఊహించగలిగితే పాపకార్యం చేయడమే ఉండదుగా!*

అన్నాడు రెడ్డి మిత్రుణ్ణి అభినందిస్తూ.

"ఆగు రెడ్డీ ఆగు! అంతటితో అయిపోయిందేమిటి? రేపురాత్రి వేణుగోపాలస్వామివారికి అభిషేకంకూడా చేయించాలి!" అన్నాడు శాస్త్రి.

కోటిరెడ్డికి శాస్త్రిగారి అభిమతమేమిటో అర్థం కాలేదు.

"వాడు కాస్తా హరీ అన్నాడంటే పోలీసులు మన వెంటపడి, ఆ సమయంలో మీ రెక్కడున్నారు? ఏం చేస్తున్నారు? ఎవరు సాక్ష్యం? అని సవాలక్ష ప్రశ్నలతో మన ప్రాణాలు తియ్యరూ?"

కోటిరెడ్డి ఎగిరి గంతేశాడు. "అవును శాస్త్రి. అవును. అక్కడ 'అది' జరిగే సమయంలో ఇక్కడ మనం స్వామివారి సన్నిధిలో, పురప్రముఖుల సమక్షంలో ఉన్నట్టు బుజువు ఏర్పరచుకోవడం అవసరం!" అంటూ ఈజీఛేర్‌లోంచి లేచి, ఇంట్లోకి దారి తీశాడు.

రామశాస్త్రి గర్వంగా నవ్వుకున్నాడు.

ఇంట్లోకి వెళ్ళిన కోటిరెడ్డి పది నిమిషాల తరవాత బైటికి వచ్చాడు. అతని చేతిలో అయిదు పచ్చనోట్లు ఉన్నాయి.

"ఇదిగో! ఈ అయిదూ నీ దగ్గర ఉంచు. రేపు భీముడికీ, అభిషేకానికీ కావలసి ఉంటుంది." అన్నాడు.

"అలాగే అలాగే" అంటూ శాస్త్రి ఆ అయిదు నోట్లూ అందుకుని బొడ్లో దోపుకున్నాడు.

"ఇక వెళ్ళివస్తా!" అంటూ శాస్త్రి అడుగు ముందుకి వేసి, వెంటనే ఏదో జ్ఞాపకానికి రాగా, చటుక్కున ఆగి, వెనక్కి తిరిగాడు. "ఇంతకీ ఆ కార్డుముక్కేదీ?" అంటూ చెయ్యి జాపాడు.

"ఇదిగో!" కోటిరెడ్డి పోస్ట్‌కార్డ్‌ని శాస్త్రి కందించాడు.

శాస్త్రి కార్డు నందుకుని, "ఏదీ, కాస్త అగ్గిపెట్టె ఇలా పడేయ్" అన్నాడు.

రెడ్డి అగ్గిపెట్టె ఇచ్చాడు. శాస్త్రి ఆ కార్డు తగలబెట్టాడు.

తగలబడుతూన్న పోస్టుకార్డుకేసే చూస్తూ "ఇంతకీ ఈ కార్డు నీ చేతికెలా వచ్చింది?" అని ప్రశ్నించాడు రెడ్డి.

"ఏముంది? ఆ తపాలాబంట్రోతు మనవాడేగా? మావాడివద్దనుండి ఏదేనా ఉత్తరం వచ్చిందేమోనని తపాలాకట్ట గాలిస్తుండగా ఈ కార్డుముక్క కంట బడింది. అంతే! బుర్ర చకచకా పనిచేసింది! ఇకనేం? కార్డుముక్క కాస్తా కాజేశాం" అన్నాడు నవ్వుతూ.

వి. ఎస్. చెన్నూరి

"మొత్తానికి బహాగట్టి బుర్రేనోయ్ నీది!" రెడ్డి శాస్త్రిని అభినందించాడు.

"ఆఁ ఆఁ! పొగడ్తలు నా వంతా! పదవులు నీ వంతూను."

శాస్త్రి ఊడిన జుట్టుముడి ఓ మాటు గట్టిగా ఝాడించి, ముడివేసుకుని, కండువా సర్దుకుంటూ వెళ్ళిపోయాడు.

"ఈ దెబ్బతో ఆ కాస్త అడ్డుకూడా తొలగిపోతుంది. ఇక మనల్ని ఎదిరించే వాళ్ళెవరూ లేరు" అనుకున్నాడు రెడ్డి. అనుకోకుండానే అతని ఎడంచెయ్యి మీసంమీదికి వెళ్ళింది. కళ్ళు ఎర్రబడ్డయ్. "హుఁ! కుర్రవెధవ! మమ్మల్నే ఎదిరిస్తాడూ?" కసిగా పళ్ళు పటపట లాడించాడు.

* * *

ఎల్లారెడ్డిపాలెం అంత బస్తీకాదూ, ఇటు పల్లెటూరూ కాదు. వెయ్యి గడపలు ఉంటుంది. రైల్వేస్టేషన్ దగ్గర్లోనే ఉండి ఉంటే ఈ పాటికి బస్తీఅయి కూర్చునేదే. కోటిరెడ్డిగారి అదృష్టమో అంటూ అది పెరగలేదు. అక్కడున్న వాళ్ళందరూ రైతులే. చదువుకున్న వాళ్ళుకారు. అందుచేత అయిదో క్లాసుదాకా చదువుకున్న కోటిరెడ్డే వాళ్ళకు శరణ్యమయ్యాడు.

కోటిరెడ్డి ఆ ఊళ్ళోని మోతుబరుల్లో అగ్రగణ్యుడు. మాటకారి. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆ మహాపట్టణాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలుతున్నాడు.

రెడ్డిగారు ఆ ఊరికి మకుటంలేని మహారాజయితే శాస్త్రిగారు మహామంత్రి. బమ్మిని తిమ్మిని చెయ్యడంలోనూ, తిమ్మిని బమ్మిని చెయ్యడంలోనూ వారికి వారే సాటి. కాపరాలు చెడగొట్టాలన్నా, తలలు ఎగరగొట్టాలన్నా శాస్త్రిగారి బుర్ర అమోఘంగా పనిచేస్తుంది. ఆ దుష్టద్వయాన్ని ఆ ఊళ్ళో ఎదిరించే మగవాడు లేడు. వాళ్ళు ఆడింది ఆట! పాడింది పాట!

అవధానిగారు ఆ ఊళ్ళో సామాన్య కుటుంబీకుడు. చాలా నెమ్మదస్తుడు. సాధ్యమయినంతవరకు నలుగురికీ మంచిగా ఉండాలని ప్రయత్నించేవాడు. అలాంటివాడి కడుపున పుట్టాడు చంద్రశేఖరం. కాస్త గట్టిపిండం. ముక్కుకి సూటిగా నడవడం అతనినైజం. అన్యాయాలని సహించడం కానీ, అక్రమాలని ఎదుర్కోకుండా ఉండడం కానీ చేతగాని వ్యక్తి. పైచదువులకి పట్నం వెళ్ళిన చంద్రశేఖరం ఇల్లు చేరుకోగానే చిన్న ఉద్యమాన్ని లేవదీశాడు. ఊళ్ళోని కుర్రకారులంతా ఆకట్టుకుని రెడ్డిగారికి ప్రతి చిన్న విషయంలోనూ అడ్డు తగులుతున్నాడు. అటు రెడ్డిగారికీ, ఇటు శాస్త్రిగారికీ పెద్ద సమస్యగా తయారయ్యాడు.

ఈనాడు తమ సమస్యకు జవాబు లభించింది. తమ అడ్డు తొలగబోతూంది. ఇక తమ రాజ్యాన్ని నిరాఘాటంగా ఏలుకోవచ్చు.

* * *

మరునాటి ఉదయం సూర్యోదయం కాకముందే భీముణ్ణి కలుసుకుని, జరగవలసిందంతా చెప్పి, ఓ పచ్చనోటు వాడిముఖాన పడేసి ఇల్లు చేరుకున్నారు శాస్త్రిగారు. ఇల్లు చేరుకున్న లగాయతు సూర్యాస్తమయం వరకూ స్వామికార్యంలో మునిగిపోయారు.

ఆ రాత్రి పురప్రముఖుల సమక్షంలో, చంద్రశేఖరం

పుణ్యమా అని, వేణుగోపాలస్వామివారు అభిషేకం చేయించుకున్నారు. అభిషేకానంతరం రాత్రిపన్నెండింటి దాకా హరికథా కాలక్షేపంకూడా జరిగింది.

కాగల కార్యం గంధర్వులికి విడిచిపెట్టి, అటు మహారాజా, ఇటు మహామంత్రీ వేణుగోపాలస్వామివారి సన్నిధిలో భక్తివినమ్రులై నిల్చున్నారు.

రాత్రిలో పన్నెండు కొట్టగానే సర్వకార్యాలూ ముగించుకుని, కనుసైగలతో పలకరించుకుని, ఇద్దరూ తమ తమ ఇళ్లకేసి బయలు దేరారు.

మళ్లీ తెల్లవారింది. శాస్త్రిగారు కాలకృత్యాలు పూర్తిచేసుకుని, చద్దన్నం సుష్టుగా పట్టించి ఊరిమీదికి బయలుదేరాడు. వినవలసిన విషయం వినిపిస్తుందేమో అని, చెవులు రిక్కించుకుని, ఊడిన జుట్టు ముడి వేసుకోవడానికి సైతం తీరిక లేకుండా తెగ తిరుగుతున్నాడు. నాలుగు తలలు ఒక్కచోట కనిపిస్తే చాలు, అంగలమీద అక్కడికి చేరుకుంటున్నాడు. కాని వినదగిన విషయం ఏదీ వినిపించకపోయేసరికి మధ్యాహ్నం పన్నెండింటి దాకా తెగ తిరిగి, విసిగి వేసారి, ఇల్లు చేరుకుని కుర్చీమంచంమీద కూలబడ్డాడు.

"అయినా నా ఆత్రత గాని, అప్పుడే ఎలా తెలుస్తుంది? శవాన్ని ఏ డొంకలో పడేశాడో! కాకులూ గద్దలూ మూగేదాకా ఎలా బైటపడుతుంది?" అనుకున్నాడు.

మధ్యాహ్నం భోజనానంతరం, చిన్న కునుకు తీసి, మళ్లీ ఊరిమీద పడ్డారు.

ఈ దఫా శాస్త్రిగారి ఆశ నిరాశ కాలేదు. రైలు స్టేషనుకీ ఊరికీమధ్య నున్న తాటితోపులో, ఓ ముళ్లపొదలో ఏదో శవం పడిఉందనీ, కాకులూ గద్దలూ పీకడంమూలాన మనిషెవరో తేలిందనీ, నలుగురూ అనుకుంటూండగా విన్నారు. మహానంద భరితులయ్యారు. తక్షణం ఆఘమేఘాలమీద రెడ్డిగారి వద్దకి చేరుకుని ఆ సువార్తని కాస్తా వారి చెవినికూడా పడేసి, వారి ఆనందంలోకూడా భాగం పంచుకున్నారు. ఆ పరమానందంలో పొద్దు పోవడంకూడా గమనించలేక పోయారు. ఆత్మారాముడు గోలపెట్టేదాకా అక్కణ్ణించి కదల్లేకపోయారు.


## 1968-69 లో మీ అదృష్టము

ఏదైన ఒక పుష్పం పేరున్ను, మీ చిరునామాయున్ను వ్రాసిన ఒక పోస్టుకార్డుమాత్రం పంపండి. మీకు వచే 12 నెలలలో వ్యాపారంలో లాభ నష్టములు, ఉద్యోగంలో ప్రమోషను, బదిలీ, సంతానం, వివాహం, సౌఖ్యం, మొదలైన వివరములు, దుష్టగ్రహ వీక్షణలకు శాంతి విధానములతో



పాటు రు. 1.25 పై లకు పంపగలము. పోస్టేజి అదనం. ఒకసారి చూచిన మీకే తెలియగలదు.

**PT. DEV DUTT SHASTRI**
**Raj Jyotshi (A.P.W.)**
**P.B. No. 86, JULLUNDUR CITY**


"బాగా పొద్దు పోయింది. ఇక వెళ్ళు శాస్త్రీ. ప్రొద్దున కలుసుకుందాంలే" అన్నాడు రెడ్డిగారు భోజనానికి లేస్తూ.

"అలాగే అలాగే వస్తా" అంటూ కండువా సర్దుకుని బయలుదేరారు శాస్త్రిగారు.

తీరా గడపదాటి నాలుగడుగులు ముందుకి వేసేసరికి శాస్త్రిగారు కాళ్లు వాటంతట అవే ఆగిపోయాయి. గుండెలుకూడా ఆగిపోయినట్టనిపించింది. అసలు ఇది కలా నిజమా? అన్న సందేహంకూడా వేసింది. కళ్లు నలుపుకుని మరీ చూశారు. కలగాదు. నిజమే. శాస్త్రి గారికి ఎదురైన వ్యక్తి నవ్వుతున్నాడు.

"అదేమిటండీ! అలా నిస్తుబోయి చూస్తారేం? నేనేనండి చంద్రశేఖరాన్ని."

"మరే, మరే, ఆ సూటూ బూటూ చూచి మావాడేమోననుకున్నా. అయినా, పిచ్చిగాని, ఉత్తరం రాయకుండా ఎలా వస్తాడ్లే! వస్తా! వస్తా!" శాస్త్రిగారు అంగలమీద నడుస్తున్నారు. ఈ దఫా ఊడింది జుట్టుముడికాదు గోచీ! అయినా దోపుకునే ఓపిక లేదు.

అప్పుడే రైలు దిగి వస్తూన్న చంద్రశేఖరం శాస్త్రిగారి వాలకం అర్థంకాక, తన దారిన తాను వెళ్లిపోయాడు.

శాస్త్రిగారు ఇల్లు చేరుకున్నాడు. కుర్చీమంచం మీద కూలబడితేగాని బుర్ర పనిచేసేలా లేదు. చచ్చినమనిషి బ్రతికిరావడం అతడెప్పుడూ వినలేదు! ఇంత క్రితం తనకి కనిపించింది దయ్యంకాదు. మనిషే! సందేహంలేదు!

"ఏమండీ! మిమ్మల్నే! అబ్బాయి ఉత్తరం రాశాడండీ." శాస్త్రిగారి శ్రీమతి వంటింట్లోంచి చెప్పిన మాటలు శాస్త్రిగారి చెవికి దూరేలా లేదు.

"మిమ్మల్నేనండీ! వినిపించలా?"

శాస్త్రిగారు ఉలిక్కిపడి, "ఏమిటే నీ గోల?" అని కసురుకున్నారు.

"అబ్బాయి ఉత్తరం రాశాడండి!" వంటింట్లోంచి వచ్చిన శ్రీమతి ఒళ్లోంచి పోస్టుకార్డుతీసి శాస్త్రిగారి కందిస్తూ "ఏం రాశాడో కాస్త చదివి వినిపిద్దురూ?" అంది.

"ఏం రాస్తాడు? 'మీరు పంపించే డబ్బు చాలడం లేదూ. మరో పాతిక రూపాయలైనా అదనంగా పంపించకపోతే ఇక్కడ గడిచేలా లేదు' అని రాసి ఉంటాడు. మామూలుపాటేగా?"

"ఉత్తరం చదవకుండానే ఏమిటండీ ఆ ఊహాగానాలు. డబ్బు చాలడం లేదని రాశాడంటే రాయడూ మరి! పట్నం చదువులంటే మాటలా? కాస్త ఉత్తరం చదివి పెడుదురూ!"

"ఊఁ! సరే, ఇలా ఏడువ్ ఆ ఉత్తరాన్ని" శాస్త్రిగారు విసుగ్గానే చెయ్యి జాపి, ఉత్తరాన్ని అందుకున్నాడు.

శాస్త్రిగారి మనసు మాత్రం ఊరికీ స్టేషనుకీ మధ్యనున్న తాటితోపులో తాండవమాడుతూంది. ఒకటికి రెండు మార్లు చదివినా ఉత్తరం అర్థం కాలేదు. మనసుకి కళ్లాలు బిగించి ఉత్తరాన్ని మూడో సారి చదివాడు.

"దశరా సెలవులు ఊళ్లోనే గడపదలుచుకున్నాను.

## ధర్మసందేహాలు

### రైలు ముందుకు పరిగెడుతూంటె అది వదిలే పొగ వెనక్కు వెడుతుందా?

వెళ్లదు. రైలు వెడుతున్న దిశలోనె పొగకూడా వెడుతూంటుంది. కాని, పొగ చాలా నెమ్మదిగా వెడుతూండటంచేత మన కంటికి అది వెనకకు వెడుతున్నట్లు కనిపిస్తుంది. ఏ గాలిని చీలుచుకుంటూ రైలు సాగుతూందో అదే గాలిలోకి పొగకూడా వెడుతుంది. రైలు నడకను గాలి ప్రతిఘటించినట్లే పొగనుకూడా మరింతగా ప్రతిఘటిస్తుంది. పొగ చాలా తేలికైంది కదా! వాయుహీన ప్రదేశంలో రైలును నడిపిన పక్షంలో రైలుతోపాటు సమవేగంతో పొగకూడా ముందుకే పయనిస్తుంది.

మెల్లిగా నడిచే రైలును మనం వేగంగా పరిగెత్తే రైలునుంచి చూస్తే అది నడుస్తున్నట్లు కనిపిస్తుంది. నడుస్తున్న రైలు వదిలే పొగకూడా మన కంటికి ఈ విధంగా కనిపిస్తుంది. మన కళ్ళు మనల్ని దగా చేస్తూంటాయి.

8 వ తేదీ రాత్రిబండికి వస్తున్నాను" శాస్త్రిగారు పైవాక్యాన్నే ఒకటికి నాలుగు సార్లు చదివి, ఉత్తరం మీది తేదీ కేసి చూశారు. చూస్తూండగానే శాస్త్రిగారు ఆపాదమస్తకం గజగజ లాడిపోయారు.

ఈ రోజు తారీఖు తొమ్మిది. ఉత్తరం ప్రకారం అబ్బాయి నిన్నరాత్రి బండికే దిగిఉండాలి. నిన్న చేరవలసిన ఉత్తరం ఈ రోజు తగలడింది. మరి అబ్బాయి ఏమైనట్టు?

శాస్త్రిగారి మనసు కళ్లాలు తెంచుకుని తాటితోపు కేసి పరుగులు తీసింది.

"తాటితోపులో, ముళ్లపొదలో ఎవరిదో శవం పడిఉంది! కాకులూ గద్దలూ పీకడం మూలాన మనిషెవరో గుర్తు తెలీడం లేదు!" నలుగురూ అనుకుంటూండగా విన్న మాటలు శాస్త్రిగారి చెవుల్లో మారుమోగినయ్.

సూటూ బూటూ తొడుక్కుని వాడూ చంద్రిగాడిలాగే ఉంటాడు!

"అమ్మ బాబోయ్! ఇంకేముంది!" శాస్త్రిగారు పెద్దగా ఓ గావుకేక పెట్టి కుర్చీమంచంలో కూలబడ్డారు.

శాస్త్రిగారి శ్రీమతి కిదేమీ అర్థంగాక గుడ్లప్పగించి భర్తగారికేసి చూస్తూంది.

అనుకున్న రోజుకి ఒక్క రోజు ఆలస్యంగా బయలుదేరిన చంద్రిగాడు బ్రతికిపోయాడనీ, చేరవలసిన రోజుకి ఒక్క రోజు ఆలస్యంగా ఉత్తరం చేరడం మూలాన చంద్రిగాడి స్థానాన్ని తమ కుమారుడు భర్తీ చేశాడనీ శాస్త్రిగారు ఎలా చెప్పగలరు? కాగల కార్య గంధర్వులే తీరుస్తారు మరి! ★